


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## పెళ్ళి చేసిచూడు -1

**ఇల్లు కట్టిచూడు** 'పెళ్ళి చేసి చూడు' అన్నారు పెద్దలు. రెండూ కష్టమే. మొదటిది డబ్బు, కాలమూ ఎంత పడుతుందో చెప్పలేము. ఏదో వుండడానికి వరసగా గదులూ, ఇంటి ముందో వసారా, వెనక వంటకో చుట్టిల్లూ, పంచా అనుకునేవారు పల్లెటూర్లలో.

పట్నాలలో చుట్టూ మనిషి నడిచే స్థలం విడిచి పెట్టుకుని, రైలు పెట్టెల్లా ఇల్లు వేసేవారు మా చిన్నతనంలో. ఉన్న వాళ్ళైతే డాబా ఇల్లు. అంతే. కానీ ఇప్పుడు ఇల్లు అయినా పెళ్ళి అయినా ఆషామాషీ కాదు. మేం ఇంటి ప్లాన్ పలక మీద వేసుకున్నాం నేనూ మా ఆయనా. మా అమ్మమ్మ బావుంది అంటే, మేస్త్రికి ఇచ్చాం. ఇప్పుడు ఆర్కిటెక్ట్ ఏంచెపితే మోడల్ హౌస్‌లో ఎలా వుంటే, అలా కట్టుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే, నాలుగు గోడలు కొనుక్కుని దానికిందా మీదా మనది కాదు. ఆ మధ్యన శూన్యంలో మనకి ఇష్టమైనట్టు కట్టుకుని, డబ్బు కొద్దీ కళాకృతులు కొనుక్కుని పెట్టుకుంటున్నారు.

మాకు ఇల్లు కట్టుకునే పని పెళ్ళయి పిల్లలు పుట్టగానే అయిపోయింది.

ఇంక పెళ్ళి చేసి చూడు. ఈ పని ఇద్దరూ మగపిల్లలే కాబట్టి "మీకేం అండీ సులభంగా అవుతుందీ" అని నలుగురూ అంటే నిజం అనుకున్నాం. కాదు అబద్ధం. ఎందుకంటే ఇల్లు కట్టడం మీ చేతిలో వుంది. డబ్బు ఇస్తే అవుతుంది. కానీ పెళ్ళి చెయ్యడం మన చేతిలో లేదని మా అబ్బాయిలిద్దరూ నిరూపించారు.

అట్టే శ్రమ పెట్టలేదు. బుద్ధిగా చదువుకున్నారు. వాళ్ళని మేమూ, మమ్మల్ని వాళ్ళూ కష్టపెట్టలేదు. అమెరికాకి వెళ్ళి మాస్టర్స్ చేసొచ్చారు. మంచి ఉద్యోగాలు తెచ్చుకున్నారు. ఇంతవరకూ లోకం పాత్ర తక్కువ. ఇక్కడనుండీ సమాజం అనండీ లేదా లోకం అనండీ. దీని ఓవర్ ఏక్షన్ ఎక్కువైంది.

"మీ అబ్బాయి చదువు అయిందా? సంబంధాలు చూస్తున్నారా? మాఎరికలో ఓ సంబంధం వుంది. చాలా ఉన్నవాళ్ళు. ఆయనకి ఒక్కగానొక్క ఆడపిల్ల. ఆస్తి అంతా ఆ పిల్లకే. ఓసారి చూడండి. చెప్పలేం ఏ పుట్టలో ఏ పాము వుందో?"

మొదటగా తల్లికి మనసులో వచ్చే ఆలోచన " మా చిన్న వెధవకి ఇంకా అమ్మ కలిపి పెడితే కానీ ఆవకాయ అన్నం తినడం రాదు. ఆకలేస్తే ఏదో అవుతోందమ్మా ఓ మాదిరిగా" అని యమగోలలో సత్యనారాయణలా అంటాడే కానీ ఆకలని చెప్పడం రాదు. వీడికి అప్పుడే పెళ్ళేంటి లే?" అని.

కానీ లోకంగాడు మనతో ఓ మాట అని ఊరుకోడు. వెళ్ళి అవతల పార్టీకి కూడా మన గురించి ఉన్నవీ లేనివీ చెప్పి, అబ్బాయి అందంలో నవమన్మధుడు, చదువులో బృహస్పతి, ఆడబిడ్డల పోరు లేదు. అత్తమాలోకానికి ఓ రావు కాయితాలిస్తే చాలు.. రాసుకుంటూ కూర్చుని, చుట్టూ లోకాన్ని పట్టించుకోదని... ఏవేవో చెప్పేసి, ఆ సదరు పిల్ల తల్లి చేత ఫోన్స్ చేయిస్తారు.

ఆ తల్లి ఫోన్లో నన్ను ఇంటర్వ్యూ చేసి "ఆదివారం సాయంత్రం 5.30 దాటి మూడు సెకన్లు కాగానే, పిల్లాడ్ని మేం చూడాలండీ దివ్యమైన ముహూర్తం, మా సిద్దాంతి చెప్పారు. అమృతఘుడియలు. ఆ సమయంలో చూసుకుంటే పెళ్ళి అయిపోతుంది" అంది.

నాలో సంఘర్షణ. ఈ విషయం మా అబ్బాయికి ఎలా చెప్పాలి? "పెళ్ళి చూపులా?" అని వాడు, మోహన్‌బాబు గోపాల్రావుగారి అమ్మాయిలోలాగా "ఉద్యోగమా?" అన్నట్లు అరుస్తాడు అని మధన పడి పడి చివరకి భయపడ్తూ "ఇలా ఒకళ్ళు సాయంత్రం నిన్ను చూస్తార్రా" అన్నాను.

"నన్నే ఎందుకు? రోడ్డు మీద నిలబడితే చాలామంది ఉంటారుగా" అన్నాడు.

నేను కేస్ మొత్తం ఎక్స్‌ప్లెయిన్ చెయ్యగానే, సోఫాలో కిందా మీదా పడి నవ్వి, వాడి ఫ్రెండ్స్‌కి ఈ విషయం ఫోన్ చేసి చెప్పి "అయిబాబోయ్ ఇది అకల్ట్ సైన్స్, చేతబడో, వశీకరణమో, ఇన్ని గంటల ఇన్ని నిమిషాలకి చూస్తే, ఆ అమ్మాయిని పెళ్ళి చేసేసుకోడం. ఇంత మంత్రప్రయోగం నా మీద అవసరమా అమ్మా? ఎవరమ్మా ఆ సిద్దాంతి? నాకు రికమండేషన్ లేకుండా ఈ వశీకరణంతో ఇండియాలో గవర్నమెంట్ జాబ్ ఇప్పించగలడా?"

ఇలా నన్ను ఆటపట్టిస్తూ నానారకాలుగా మాట్లాడి మొత్తానికి వాళ్ళు వచ్చే సమయానికి ఇంట్లో లేకుండా పోయాడు.

ఆ మధ్యవర్తి పిల్ల తల్లిని తీసుకురావడం, ఆవిడ మూతి ముక్కూ విరుస్తూ వాళ్ళ ఆస్తి వివరాలు చెప్పి, నన్ను లెక్కలు అడగడం, నేను వణుకుతూ కాఫీలవీ అందించడం అయ్యాక వెళ్ళిపోయింది.

ఆ మాయదారి ముహూర్తం నిజంగా మహిమాన్వితమో ఏమో కానీ, కాఫీ ఇస్తూంటే చూసిన సొట్టకాలు, ఒంకర చూపు మధ్యవర్తి, రోజూ నాకు ఫోన్ చేసి "మీ నవ్వు వినడానికి చేస్తున్నా. లేకపోతే నిద్రపట్టడం లేదు. ఈ మధ్యే మా ఆవిడ పోయింది" అంటూ చెత్త వాగుడు మొదలెట్టాడు.

తేలు మంత్రానికి ఉపయోగించినట్లు "చెప్పు ఉపయోగిస్తా" అంటే అప్పుడు మానాడు.

మొదటి పెళ్ళి చూపులు ఇలా అయ్యాయా! ఇలా వరసగా లోకంగాడూ లేదా లోకాయమ్మా సంబంధాలు తెచ్చింది. ఒక అమ్మాయి ఫోన్‌లో "నేను తాగుతాను. నాకు బాయ్‌ఫ్రెండ్ వున్నాడు. మా అమ్మ నా చేత రుక్మిణీ కళ్యాణం చదివించి, వ్రతాలు చేయిస్తుంది. ఇంట్లో వాళ్ళకి నేను సిగరెట్ తాగుతా, మందు కొడ్తా, బాయ్‌ఫ్రెండ్ వున్నాడని తెలీదు. నువ్వే ఎలాగో అలా మేనేజ్ చేసి, నేను నచ్చలేదు అని చెప్పేయ్" అందిట ఆ అమెరికా అమ్మాయి.

ఆ తల్లీ తండ్రీ "మా అమ్మాయి ఈ కాలంలో పుట్టాల్సిన పిల్ల కాదండీ. మమ్మల్ని అడక్కుండా సినిమాకి కూడా వెళ్ళదు. ఒక్క ఆడ స్నేహితురాలు కూడా లేదు. (ఈ మాట నిజం) ఇలా తెగ చెప్పారు.

మా అబ్బాయి నాతో "ఇలాంటి అమ్మా నాన్నలకి అలాంటి కూతురే రైట్ మామ్! అసలు పెళ్ళి సంబంధాలు చూడడం ఏవిటి ట్రాష్? కాంట్ షీ ఫైండ్ ఏ బోయ్?" అన్నాడు.

ఆ తర్వాత లోకమ్మా, లోకయ్యా ఏం చెప్పినా వాడికి సంబంధాలు చూసే ఆశ వదులుకున్నాను.

మా చిన్నప్పుడు మా అక్కల పెళ్ళి చూపులు చూసి, నేనూ ఎంతో ముచ్చట పడ్డాను. ఆ ఆశ తీరకుండానే, చిన్నప్పటి నుండీ చూసిన అబ్బాయొచ్చి నన్ను పెళ్ళి చేసుకున్నాడు. మా అబ్బాయి పెళ్ళి చూపులకి వెళ్ళి సరదా తీర్చుకుందాం అంటే వీడు పడనిచ్చేట్టు లేదు.

చూస్తూ చూస్తూ ముప్పై వచ్చాక, అవతల పార్టీవాళ్ళు "మీ అబ్బాయికి ఏజ్ బార్ అయిపోయిమంది. కష్టం మీరు తొందరపడాలి" అని హెచ్చరించడం మొదలెట్టారు.

ఓ తెలిసిన వాళ్ళ ద్వారా వచ్చిన సంబంధంలో, పిల్ల తండ్రి మా అబ్బాయి ఇంట్లో కూడా 'సాక్స్' వేసుకుని తిరుగుతున్నాడు. కాలి వేళ్ళు అన్నీ ఉన్నాయో లేదో అని అనుమానపడ్డాడుట. తర్వాత తెలిసింది. ఈలోపు "అసలు మీ అబ్బాయి పెళ్ళి ఎందుకు చేసుకోనంటున్నాడు అసలు విషయం ఏవిటీ?" అని నా మీద సోషల్ ప్రెషర్ పెరిగింది.

అమ్మాయిలతో ఫోన్స్‌లో మాట్లాడితే పర్లేదు. అబ్బాయిలతో కాకపోతే చాలు అనే లెవెల్ కొచ్చాను.

మా అబ్బాయి "వాట్ ఈజ్ యువర్ ప్రోబ్లం? తొమ్మిదో తరగతిలో అమ్మాయిలతో ఫోన్స్‌లో మాట్లాడితే గొడవ చేసావ్. మాస్టర్స్ చదివాక అబ్బాయిలతో మాట్లాడొద్దు అంటున్నావ్? ఆర్ యూ ఓకే?" అన్నాడు.

చెప్పుకోలేని బాధ. నాలో నేనే తెగ మథన పడ్తూ, పిల్లల పెళ్ళి కాని బాధిత తల్లుల సమాజంలో నా పేరు నమోదు చేయించుకున్నాను.

చుట్టాలు కూడా "ఇంకా మీ వాడికి పెళ్ళి చెయ్యడం లేదే?" అని పొడుస్తుండగా ఓ నాడు శుభవార్త చెప్పాడు. "అమ్మా ఓ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. ఆ అమ్మాయి మాతృభాష మలయాళం.." అని మిగతా వివరాలు చెప్తుండగానే "అమ్మయ్యా  అని ఎగిరి గెంతులు వేసాను

అక్కడినుండి ఆ పిల్ల తల్లితండ్రులూ మేమూ కలుసుకున్నాం. పెళ్ళి ఏర్పాట్ల గురించి మాట్లాడుకున్నాం.

"మే తెలుగు పెళ్ళి చెయ్యడానికి రెడీ. కానీ మాకు ఏమీ తెలియదుగా?" అన్నారు.

మా కోడలి ఫ్రెండ్ ఓ కన్నడ అమ్మాయి దుబాసీ పని చెయ్యడానికి ముందుకొచ్చింది.

"పసుపు కొట్టి, షాపింగ్‌కి వెళ్ళాలి" అంటే

"హల్దీమార్ కే షాపింగ్ కోజానా హై" అని చెప్పేది వాళ్ళకి. దేవుడి దయవల్ల వాళ్ళకీ నాకూ హిందీ, ఇంగ్లీషూ బాగా వచ్చు. వాళ్ళ తొంభై ఒక్క ఏళ్ళ నానమ్మ కూడా ఇంగ్లీషులోనే మాట్లాడ్తుంది.



ఆడపిల్లలు లేరన్న నాలోటు, భగవంతుడు బాగా విన్నట్లున్నాడు. ఆడపిల్లకి కావలసిన అలంకారాలూ, వాళ్ళు చెయ్యాల్సిన ముచ్చట్లూ అన్నీ నేనే చెయ్యాల్సొచ్చింది.

పూలజడా, వడ్డాణం, చెంపసరాలూ, చేతినిండా చెంకీ గాజులూ కొని బుగ్గన చుక్కా, కళ్యాణం బొట్టూ పెట్టీ నా కూతురినే చేసినట్లు పెళ్ళి కూతుర్ని చేసాను. రేపు పెళ్ళి అంటే పానకం కలిపి బిందెలు సిద్దం చేసాం. జ్యోతులు చేసుకున్నాం. కాళ్ళు కడిగే చెంబూ, పళ్ళెం కొన్నాం. ఇటు స్నాతకానికి గొడుగూ, పావుకోళ్ళూ అన్నీ రెడీ చేసాను. రెండు వైపులా చకచకా ఏర్పట్లు చేస్తూ మా నిర్మాత గోపాల్‌రెడ్డిగారి రికమండేషన్‌తో దస్‌పల్లా హోటల్లో హోమం కూడా పెట్టడానికి ఒప్పించి బుక్ చేయించేసాను.



ఇంక మా వియ్యపురాలూ నేనూ రోజూ షాపింగ్‌లే. పెళ్ళి గోలకి దుబాసీ సుషమ వుండనే వుంది. అందుకే షాపింగ్ వంకతో మధ్య మధ్యలో సినిమాలు చూసేస్తూ, ఫుడ్ టేస్టింగ్ వంకతో ఫ్రెండ్స్ వచ్చినప్పుడల్లా దస్‌పల్లా కెళ్తూ "పెళ్ళి వారమండీ" అంటూ ఏడాది నిమిషంలా గడిపేసాం.

పెళ్ళికి సినిమా ఇండస్ట్రీ పెద్దలూ, నా స్నేహితులూ, బంధువులూ అంతా వచ్చి, అక్షింతలేసి వధూవరులని ఆశీర్వదించి,

"మీ అబ్బాయి పెళ్ళిలో బేక్‌డ్ రసగుల్లా బావుందీ, చామదుంపల ఫ్రై బావుందీ, వంకాయ పచ్చి కారం స్టఫ్ బావుందీ" అంటూ ఇప్పటికీ చెప్తూనే వున్నారు . ఆ దస్‌పల్లా షెఫ్‌కి అంత తర్ఫీద్ ఇచ్చాం వారం వారం వెళ్ళి.

ఆవపెట్టిన పులిహోర ఇంపొజిషన్ రాయించినట్లు ఆరుసార్లు చేయించాను.

సారె కోసం తెచ్చిన ఐదురకాల స్వీట్స్, ఓ మూలన వున్నాయి. అయ్యో పెళ్ళి కాస్తా అయిపోతోందని, మా అనురాధ (కోడలు) కన్నడ ఫ్రెండ్ మంజునాథ్ పిల్లలందరినీ పిలిచి పంచెయ్యడం కొసమెరుపు.



మా వియ్యపురాలొచ్చి "అయ్యో రమణీ. ఇలా అయింది" అని పెళ్ళి అయిన తెల్లారి దస్‌పల్లాలో బ్రేక్ ఫాస్ట్‌లో చెప్పగానే, నేను నవ్వి "సరే తినడమేగా కావల్సింది.. ఎవరు తింటేనేం? డోంట్ వర్రీ" అని నోట్లో స్వీట్ పెట్టాను మా దేవకికి. "ఇంకేం వర్రీ నీలాంటి వియ్యపురాలు దొరికాక?" అంది.



అలా మా మొదటి అబ్బాయి అశ్విన్ పెళ్ళి "మనసులాయో" అంటూ ఉషారుగా జరిగిపోయింది మలయాళీ కుట్టీ అనురాధతో.

రెండో అబ్బాయి కృష్ణకాంత్ పెళ్ళి ఇంకా రంజుగా పంజాబీ 'కుడీ' గగన్ కౌర్‌తో ఎలా జరిగిందో రెండో పార్ట్‌లో రాస్తాను.

ఈ కాలం రాసే టైముకి ఇద్దరు కోడళ్ళ అత్తగారిగా ఒక మనవడికి నానమ్మ హోదాలో వున్నానన్నమాట.

Post your comments

